నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 3 ఏప్రిల్ 2024 | NIZAMABAD

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

# అర్వింద్, జీవన్‌రెడ్డి దొందూ.. దొందే

- జిల్లా అభివృద్ధికి చేసింది శూన్యమే..
- ఎంపీగా గెలిపిస్తే జక్రాన్‌పల్లికి ఎయిర్‌పోర్టు తీసుకువస్తా..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2: సిట్టింగ్ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇద్దరూ దొందూ.. దొందేనని, నిజామాబాద్ జిల్లా ప్రజలకు చేసింది శూన్యమేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఒక్కనాడైనా మోపాల్ ప్రజల వద్దకు వచ్చి మంచిచెడు అడిగారా? రూరల్ నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికైనా ఒక్క రూపాయి ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఎంపీగా అర్వింద్ గెలిచి ఐదేండ్లు అవుతుందని, ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఎక్కడ ఉందో చెప్పాలన్నారు. జిల్లా ప్రజలకు తండ్రీకొడుకులు ఏం చేశారో చెప్పాలని, ఇద్దరు అధికారంలో ఉన్నప్పుడే అభివృద్ధి చేయని వారు ఇప్పుడెలా చేస్తారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు. ఆశీర్వదించి తనను ఎంపీగా గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని, పార్లమెంట్ సమావేశాలు నడిచినప్పుడు ఢిల్లీలో, మిగతా రోజుల్లో జిల్లా ప్రజల వద్దే ఉంటానని తెలిపారు. ఎంపీగా గెలిచిన తర్వాత బోధన్ నుంచి బీదర్‌కు డబుల్ రైల్వేలైన్ వేయడంతోపాటు జక్రాన్‌పల్లిలో ఎయిపోర్ట్ ఏర్పాటుకు కృషి చేస్తానని వివరించారు. కాంగ్రెస్ అబద్ధ ప్రచారాలను నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మోసపోయారని, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టారన్నారు.

జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ భారీ మెజార్టీతో బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించుకుంటామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాజిరెడ్డి గోవర్ధన్ అనేక అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటారన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, జడ్పీటీసీ కమలానరేశ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ముత్తెన్న, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## ఎంపీవో, కార్యదర్శికి మెమోలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రెంజల్, ఏప్రిల్ 2 : మండలంలోని కందకుర్తి గ్రామం ఇందిరమ్మ కాలనీలో తాగునీటిని అందించడంలో నిర్లక్ష్యం వహించిన ఎంపీవో గౌసొద్దీన్, గ్రామ కార్యదర్శి సతీశ్‌చంద్రకు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ మెమోలు జారీ చేశారు. పదిరోజులుగా కాలనీవాసులకు తాగునీరు సరఫరా కావడంలేదని, దీనికి ఎంపీవో, కార్యదర్శిని బాధ్యులను చేస్తూ మూడు రోజుల్లో వారు సంజాయిషీ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు.

నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

# భానుడి భగ భగ

ఉమ్మడి జిల్లాలో 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**ఎండలు భగ్గున మండుతున్నాయి.** పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. రోజు రోజుకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారం రోజులుగా భానుడు భగభగ మండుతుండడంతో మధ్యాహ్న సమయాల్లో జనాలు ఇండ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో జిల్లా కేంద్రంతోపాటు పలు పట్టణాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరమైతే గొడుగులు, క్యాప్‌లు, స్కార్ఫ్‌లు ధరించి బయటికి వస్తున్నారు. ఎండవేడిమిని భరించలేక జ్యూస్‌లు, నిమ్మరసాలను సేవిస్తూ ఉపశమనం పొందుతున్నారు. ఇండ్లల్లో ఉండేవారు కూలర్లు, ఫ్యాన్ల కింద సేదతీరుతున్నారు.

–ఖలీల్‌వాడి/కామారెడ్డి, ఏప్రిల్ 2

నిర్మానుష్యంగా మారిన జడ్పీ రోడ్డు..

వేడి నుంచి ఉపశమనం కోసం ఆటోపై గడ్డి వేసిన దృశ్యం

ఇందూరులో నిర్మానుష్యంగా మారిన కంఠేశ్వర్ రోడ్డు

ఎండవేడి నుంచి రక్షణగా స్కార్ఫ్ కట్టుకున్న యువతి

### కామారెడ్డిలో అత్యధికంగా నమోదు..

కామారెడ్డి జిల్లాలో వారంలో రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటి వరకు గాంధారిలో అత్యధికంగా 42.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బిచ్కుందలో 41.8, ఎల్పుగొండ 41.7,డోంగ్లీ 41.7,పిట్లం 41.6, పాత రాజంపేట 41.4, పెద్దకొడప్‌గల్ 40.6, జుక్కల్ 40.6, దోమకొండ 40.6, మెన్నూర్ 40.1, బొమ్మన్‌దేవునిపల్లి 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అత్యల్పంగా గాంధారి మండలం రామలక్ష్మణపల్లిలో 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది.

### ఎడపల్లిలో 42.5 డిగ్రీలు..

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా ఎండలు మండుతున్నాయి. తాజాగా ఎడపల్లి మండల కేంద్రంలో అత్యధికంగా 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి 28న మోపాల్ మండలంలో 42.0 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశముందన్న వాతావరణ నిపుణుల హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు

### వారం రోజులపాటు నమోదైన సగటు ఉష్ణోగ్రతల వివరాలు

**నిజామాబాద్**

| తేదీ | గరిష్ఠం/ కనిష్ఠం |
|---|---|
| 28/03/24 | 8.5/25.6 |
| 29/03/24 | 39.4/25.8 |
| 30/03/24 | 39.9/26.0 |
| 31/03/24 | 40.4/27.4 |
| 01/04/24 | 41.5/26.8 |
| 02/04/24 | 40.9/27.1 |

**కామారెడ్డిలో..**

| | |
|---|---|
| 28/03/24 | 38/27 |
| 29/03/24 | 38/27 |
| 30/03/24 | 38/26 |
| 31/03/24 | 37/26 |
| 01/04/24 | 38/27 |
| 02/04/24 | 38/26 |

### అత్యవసరమైతేనే బయటికి రావాలి

అత్యవసరమైతేనే ప్రజలు బయటికి రావాలి. ఎండ తీవ్రంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు బయటికి రావొద్దు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్ల వద్ద ప్రాథమిక చికిత్స అందించడానికి ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉంటారు.

-సుదర్శనం, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, నిజామాబాద్


వాహనాలు లేక బోసిపోయిన బైపాస్ రోడ్డు

# రూ.500 బోనస్ కచ్చితంగా ఇవ్వాలి

### కలెక్టర్లకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నేతలు

కామారెడ్డి, ఏప్రిల్ 2: రాష్ట్రంలో ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు ఇచ్చిన హామీ మేరకు యాసంగి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు బీఆర్ఎస్ నేతలు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ మద్దతు ధర కన్నా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారని, అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలు, రైతులకు అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని అన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఈ నెల 6న ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక రోజు దీక్ష చేస్తామని, కొనుగోలు కేంద్రాల వద్ద ధర్నా చేసి రైతులకు అండగా ఉంటామని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, జాజాల సురేందర్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

### రైతులతో కలిసి ఉద్యమిస్తాం..

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, వీజీగౌడ్ తదితరులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 2: యాసంగి వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, లేకపోతే రైతు ఉద్యమం చేపడతామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ జిల్లాలో 26వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందని, కనీసం బోనస్‌తోనైనా బాధిత రైతులకు ఊరట లభిస్తుందనుకుంటే వారి ఆశలు అడియాశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం ఎకరానికి రూ.25వేలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మేయర్ నీతూకిరణ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, నాయకులు సిర్పరాజు, సుజిత్‌సింగ్, సత్యప్రకాశ్, రవిచందర్ పాల్గొన్నారు.

### అక్కడ వేశారు.. ఇక్కడ మరిచారు..

**పార్లమెంట్** ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాల్సి ఉండగా నిజామాబాద్ నగరంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. దాదాపు 15రోజులు దాటినా నగర నడిబొడ్డున నెహ్రూ పార్క్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి ముసుగు వేయలేదు. మెండోరా మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి అక్కడి అధికారులు ముసుగు వేయగా, జిల్లా స్థాయి అధికారులు ఉండే నగరంలో ప్రధాన చౌరస్తాలోని విగ్రహంపై ఇప్పటి వరకు దృష్టి సారించకపోవడం గమనార్హం.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నెహ్రూ పార్క్ చౌరస్తాలో..

ఎస్సారెస్పీ వద్ద..

# పోలీస్‌స్టేషన్ నుంచి అనుమానితులు పరారీ

- సిబ్బంది కండ్లుగప్పి ఉడాయించిన వైనం
- ఘటనపై సీపీ సీరియస్.. గాలింపు ముమ్మరం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ కోసం తీసుకొచ్చిన ఇద్దరు అనుమానితులు సిబ్బంది కండ్లుగప్పి తప్పించుకుపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొన్ని రోజులుగా వరుసగా చోరీ ఘటనలు జరుగుతుండడంతో కేసులను చేధించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా కొంతమంది అనుమానితులను పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నారు. రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన ఒకరితోపాటు జిల్లా కేంద్రంలోని ఆటోనగర్ ఏరియాకు చెందిన మరో అనుమానితుడిని ఆరోటౌన్ పోలీసులు విచారణ కోసం సోమవారం ఠాణాకు తీసుకువచ్చారు. సిబ్బంది పర్యవేక్షణలో ఉన్న ఇద్దరు అనుమానితులు అర్ధరాత్రి సమయంలో పరారయ్యారు. మంగళవారం ఉదయాన్నే ఠాణాలో ఉండాల్సిన ఇద్దరు అనుమానితులు లేకపోవడంతో పారిపోయినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ విషయమై సౌత్ రూరల్ సీఐ ఎన్.సురేశ్ కుమార్‌ను వివరణ అడగగా ఈ మధ్యకాలంలో జరిగిన దొంగతనం కేసులో విచారించేందుకు ఆరోటౌన్ ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ఇద్దరిని స్టేషన్‌కు తీసుకువచ్చిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే వారిపై ఇంకా ఎలాంటి కేసులు నమోదు చేయలేదని, అనుమానితులుగా విచారించేందుకు తీసుకువచ్చి ఠాణాలో ఉంచామన్నారు. ఆ ఇద్దరు అనుమానితులు స్టేషన్ నుంచి పారిపోయారని, వారిని పట్టుకునేందుకు ఓ బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు అనుమానితులు పారిపోవడంపై సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ సీరియస్ అయినట్లు సమాచారం. వెంటనే వారిని పట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది.

### మహిళ తో అసభ్యంగా ప్రవర్తించిన పోకిరీలకు రెండు రోజుల జైలు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు పోకిరీలకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషీయల్ మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పు వెలువరించారు. మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఎంఎస్ఆర్ మైదానంలో మార్చి 31వ తేదీన ఉదయం ఓ మహిళ పట్ల ముగ్గురు పోకిరీలు అసభ్యంగా ప్రవర్తించారు. బాధితురాలు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డిచ్‌పల్లి మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన నితిన్, ఘన్‌పూర్‌కు చెందిన సాయికుమార్, నగరంలోని ఇంద్రపూర్‌కు చెందిన అంతగిరి సాయికుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ముగ్గురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

### సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

**సీపీకి బాధితుడి ఫిర్యాదు.. తొలి ఎఫ్ఐఆర్ నమోదు**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు ఓ బాధితుడు తాను సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు సీపీ కల్మేశ్వర్ సింగెనవార్‌కు ఫిర్యాదు చేశాడు. సీపీ ఆదేశాల మేరకు సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మొదటి రోజు తొలి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు స్టేషన్ డీఎస్పీ తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి రూ.లక్షకు పైగా డబ్బులు పోగొట్టుకున్న బాధితులు సీపీ ఆఫీస్ వెనుక ఏర్పాటు చేసిన సైబర్‌క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సీపీకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు